క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ మండల అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

బేస్తవారిపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది.

అర్ధవీడు మండలం:
యూత్ వింగ్ అధ్యక్షుడిగా బొల్లవరపు శ్రీనివాసరెడ్డి, మహిళా విభాగానికి పుప్పల మరియమ్మ, రైతు విభాగానికి వల్లెల మద్దిలేటిరెడ్డి, బీసీ సెల్‌కు కలువ కాశీరావు, ఎస్సీ సెల్‌కు ఉసిపల్ల ధనమయ్య, ఎస్టీ సెల్‌కు మూద లక్ష్మీనారాయణ నాయక్, మైనార్టీ సెల్‌కు షేక్ నాసర్ వలి, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు మందెం రత్నప్రభాకర్‌రావు, స్టూడెంట్ వింగ్‌కు షేక్ హారిప్, పంచాయతీరాజ్ వింగ్‌కు మామిళ్ల కాశిరెడ్డి, ఆర్టీఐ వింగ్‌కు షేక్ మౌలాలి(డెంటల్), వలంటీర్స్ వింగ్‌కు చెంచని శ్రీనివాసులు, వీవర్స్ వింగ్‌కు బగ రవీచంద్రుడు, వాణిజ్య విభాగానికి గొల్ల వెంకట నారాయణ, వైఎస్సార్ టీయూసీకి రేచర్ల కొండయ్య, అంగన్‌వాడీ వింగ్‌కు పూర్ణకంటి కుమారి, కల్చరల్ వింగ్‌కు భూపని రమణ, సోషల్ మీడియా వింగ్‌కు దార రవి, దివ్యాంగుల విభాగానికి రావులకొల్లు బాలంజనేయులు, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా నారు ఆదినారాయణరెడ్డిని నియమించారు.

బేస్తవారిపేట మండలం:
యూత్ వింగ్ అధ్యక్షుడిగా మాచర్ల వెంకటేష్‌రెడ్డి, మహిళా విభాగానికి మూల చంద్రకళ, రైతు విభాగానికి తమటం రమణారెడ్డి, బీసీ సెల్‌కు మొగుళ్లూరి బీమయ్య, ఎస్సీ సెల్‌కు తిరుపతి వీనోద్‌కుమార్, ఎస్టీ సెల్‌కు అనగాని సుధాకర్, మైనార్టీ సెల్‌కు షేక్ రహమతుల్లా, క్రిస్టియన్‌మైనార్టీ సెల్‌కు గుంటూరు దీపక్, స్టూడెంట్ వింగ్ కొనబోయిన ప్రవీణ్‌కుమార్, పంచాయతీరాజ్ వింగ్‌కు కొప్పుల కొండారెడ్డి, ఆర్టీఐ వింగ్ కర్నాటి అయ్యపురెడ్డి, వలంటీర్స్ వింగ్ బైరెడ్డి రమణారెడ్డి, వీవర్స్ వింగ్ చిట్టి మల్లికార్జున, వాణిజ్య విభాగానికి కొల్లి శేషగిరిరావు, వైఎస్సార్ టీయూసీ దయ్యాల నరసయ్య, అంగన్‌వాడీ వింగ్‌కు తిరువీధి లక్ష్మీ, కల్చరల్ వింగ్‌కు గుమ్మా రవి, సోషల్ మీడియా వింగ్‌కు దూదేకుల హుస్సేన్, దివ్యాంగుల విభాగానికి వేమూరి రాజు, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా మిట్టా చంద్రశేఖర్‌రెడ్డిని నియమించారు.

రామదూత క్షేత్రంలో నందీశ్వరునికి పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొనకనమిట్ల: ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని కొనకనమిట్ల సమీపంలోని రామదూత క్షేత్రంలో నందీశ్వరునికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుడు అకలంకం వెంకటరామ కృష్ణాచార్యులు ఆధ్వర్యంలో విగ్రహదాతలు, భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉభయదాతలను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యక్కంటి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనాథ స్వామికి ప్రత్యేక పూజలు

పెద్దారవీడు:

మండలంలోని రాజంపల్లి సమీపంలో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ గొంద్రాలికొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు గురువారం రాజ్యలక్ష్మి సమేత తిరుమలనాథస్వామికి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు అభిషేకం, అర్చనలు, మంగళ హారతి తదితర పూజలు చేసిన అనంతరం పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. రాత్రి శేష వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి కొలువుదీరారు. అలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులను మేళతాళాల మధ్య భక్తి పాటలు పాడుకుంటూ భక్తులు ఊరేగింపు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అసంపూర్తిగా తర్లుపాడు ఏఏ ఎంపీపీ పాఠశాల



కొనకనమిట్ల : పేరారెడ్డిపల్లి యూపీ పాఠశాలలో అసంపూర్తిగా అదనపు గదులు

సమస్యల స్వాగతం

- సర్కారు బడిలో వసతులు కరువు
- నిలిచిపోయిన రెండో విడత మనబడి నాడు–నేడు పనులు
- ఏడాదిగా పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- జూన్ 12న తల్లికి వందనం ఇస్తామని జూలై 5వ తేదీకి వాయిదా
- పాఠశాలలకు అరకొరగా చేరిన విద్యామిత్ర కిట్లు

బేస్తవారిపేట:

వేసవి సెలవులు ముగియడంతో గురువారం ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. కొత్త ఆశలతో పాఠశాలలకు చేరిన విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలికాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మనబడి నాడు–నేడు కింద ప్రారంభించిన పనులను పూర్తి చేయకుండా గత ఏడాది కాలంగా కూటమి సర్కారు నిర్లక్ష్యం వహించడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గిద్దలూరు నియోజకవర్గంలోని 345 పాఠశాలల్లో సుమారు 27 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, తాగునీటి సౌకర్యం కల్పించడంపై సర్కారు చూపుతున్న అశ్రద్ధ విద్యార్థులను చదువుకు దూరం చేసేలా పరిణమించింది. అదనపు తరగతి గదుల నిర్మాణాలను నిధులు విడుదల చేయకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. పలు పాఠశాలల్లో మినరల్ వాటర్‌ప్లాంట్లు మరమ్మతులకు గురయ్యాయి. బేస్తవారిపేటలోని జెడ్పీ బాలికల హైస్కూల్, కంభంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్వో ప్లాంట్‌లు మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా స్పందన లేదు. బేస్తవారిపేట మండలంలో నాడు–నేడు రెండో విడత కింద 20 పాఠశాలల్లో చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. కొమరోలు మండలంలోని రాజుపాలెం, అల్లీనగరం, జెడ్పీ హైస్కూళ్లలో పనులు నిలిచిపోయాయి.

కొమరోలు జెడ్పీ హైస్కూల్లో నాబార్డు నిధులతో చేపట్టిన పనులు సైతం నిధుల కొరతతో ఆగిపోయాయి. రాచర్ల మండలంలోని ఆకవీడు యూపీ పాఠశాలలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. వాషింగ్ ఏరియాలో కుళాయిలు ఏర్పాటు చేయకుండా వదిలేశారు.



ఆకవీడు యూపీ పాఠశాలలో ట్యాప్‌లు లేని వాష్‌బేసిన్

నాడు విమర్శలు సరే.. నేడు సంగతేంటి?

మార్కాపురం టౌన్/తర్లుపాడు/కొనకనమిట్ల: వేసవి సెలవుల్లో వివిధ పనులు చేపట్టాల్సి ఉన్నా ఏమాత్రం పట్టించుకోకుండానే పాఠశాలలను ప్రారంభించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మార్కాపురం టౌన్, రూరల్ మండలంతోపాటు పొదిలి, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లో అరకొర వసతుల మధ్యనే ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 299 ఉండగా, వీటిలో గత ఏడాది చివరినాటికి సుమారు 30,407 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. కానీ అందుకు తగినట్టుగా వసతులు కల్పించడంలో మాత్రం సర్కారు మీనమేషాలు లెక్కిస్తోంది.

గత ఏడాది నాడు–నేడు ఫేజ్–1, ఫేజ్–2 కింద 226 పాఠశాలలను ఎంపిక చేయగా అభివృద్ధి పనుల కోసం రూ.58.76 కోట్లు కేటాయించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యే నాటికే ఫేజ్–2 కింద చేపట్టిన అదనపు తరగతి గదులు, టాయిలెట్లు, నీటి సదుపాయం, విద్యుత్, ఫర్నిచర్ తదితర పనులు 50 శాతానికిపైగా పూర్తయ్యాయి. మిగిలిన పనులను పూర్తి చేసి విద్యార్థులకు సమస్య లేకుండా చూడాల్సిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. 25 శాతం కంటే తక్కువ పూర్తయిన పనుల టెండర్లు మాత్రమే రద్దు చేయాల్సిన ప్రభుత్వం.. ఏకంగా మొత్తం పనులు నిలిపేసి సర్కారు విద్యను సమస్యల్లోకి నెట్టిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని పాఠశాలల్లో ఆర్‌ఓ ప్లాంట్లు పనిచేయక విద్యార్థులు ఇంటి నుంచి బాటిళ్లతో నీరు తెచ్చుకుని తాగుతున్నారు.



మార్కాపురం జెడ్పీ హైస్కూల్లో మరుగుదొడ్లకు తాళం

తల్లికి వందనం అందేనా..

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ప్రధానమైన హామీ తల్లికి వందనం. ఈ పథకం కింద ప్రతి ఇంట్లో ఎంత మంది చదువుకునే పిల్లలుంటే వారందరికీ పథకం కింద ఏటా రూ.15 వేలు తల్లి బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటికీ అమలు చేయలేదు. పాఠశాలల పునఃప్రారంభం రోజున కేవలం మార్గదర్శకాల జారీకే సర్కారు పరిమితమైంది. పైగా రూ.15 వేలు కాకుండా రూ.13 వేలు మాత్రమే ఇస్తామని సర్కారు ప్రకటించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అరకొరగా కిట్లు

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, బూట్లు, యూనిఫాం, బెల్ట్ తదితర సామగ్రితో కూడిన విద్యామిత్ర కిట్లను పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యకు సరిపడా సరఫరా చేయలేదు. డైస్ రోల్ ప్రకారం పంపిణీ చేయడంతో కొత్తగా చేరిన విద్యార్థులకు కిట్లు అందలేదు.

- తర్లుపాడు మండలంలో 51 ప్రభుత్వ పాఠశాలల్లో 5 వేల మందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. నాడు–నేడు 2లో భాగంగా మండంలోని 24 పాఠశాలలకు రూ.11.37 కోట్లు కేటాయించారు. వీటిలో కొన్ని భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. మరికొన్ని భవనాలు శ్లాబ్ దశలో ఉన్నప్పటికీ ప్రభుత్వం గడచిన ఏడాది కాలంగా నిధులు విడుదల చేయలేదు. ఉపాధ్యాయ బదిలీ ప్రక్రియ పూర్తికాకపోవడంతో తొలిరోజు తరగతులు అరకొరగా సాగాయి.
- కొనకనమిట్ల మండలంలో మొత్తం 78 పాఠశాలలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో నాడు–నేడు కింద 50 పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు రెండు విడతల్లో రూ.రూ.5.40 కోట్లు నిధులు మంజూరు చేయగా 70 శాతానికి పైగా పనులు పూర్తి చేశారు. ఈ క్రమంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం 25 పాఠశాలల్లో మిగులు పనులను గాలికొదిలేసింది. మండలంలోని 28 పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాల్సి ఉన్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



మార్కాపురం జెడ్పీ హైస్కూల్‌లో అసంపూర్తిగా నిలిచిన అదనపు తరగతి గదులు



కొనకనమిట్ల : అభివృద్ధికి నోచుకోని నాయుడుపేట మండల పరిషత్ పాఠశాల



నిర్మాణ పనులు నిలిచిన కొమరోలు జెడ్పీ హైస్కూల్

అంగన్‌వాడీలు ఆదర్శంగా ఉండాలి

కొనకనమిట్ల: అంగన్‌వాడీ కేంద్రాలు ఆదర్శంగా ఉండాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సకాలంలో పౌష్టికాహారాన్ని అందజేసి కేంద్రాలకు మంచి పేరు తీసుకురావాలని ఐసీడీఎస్ సీడీపీఓ సుధామారుతి పేర్కొన్నారు. గురువారం కొనకనమిట్లలోని అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. సూపర్‌వైజర్ లక్ష్మీప్రసన్న, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో కూడిన విద్య

గిద్దలూరు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్య లభిస్తుందని ఇన్‌చార్జి సీడీపీఓ జ్యోతి పేర్కొన్నారు. పట్టణంలోని నల్లబండ సచివాలయం పరిధిలోని గుంతల వీధి, రైల్వే కాలనీ, నల్లబండ బజార్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు సామూహిక అక్షరభ్యాసం, అంగన్‌వాడీ బాట ర్యాలీ నిర్వహించారు.



కొనకనమిట్లలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ సుధామారుతి



గిద్దలూరులో అంగన్‌వాడీ బాట ర్యాలి నిర్వహిస్తున్న సీడీపీఓ జ్యోతి, సిబ్బంది

అర్ధవీడు: మండల కేంద్రమైన అర్ధవీడులోని నంబర్–140 అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గురువారం సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంఈఓ–2 మాట్లాడుతూ.. ఆరేళ్లు నిండిన పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఐసీడీఎస్ సూపరువైజర్ డి.రమీజాబీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ చిలకల నాగార్జునరెడ్డి, ఎంఈఓ–2 ఎం.లక్ష్మీనాయక్, ఏఓ ప్రసాద్, వెంకటరంగారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గురుపౌర్ణమి ఉత్సవాలు

మార్కాపురం టౌన్: జూలై నెల 10వ తేదీన గురుపౌర్ణమి పండగను పురస్కరించుకుని నేటి నుంచి సాయిబాబా మందిరంలో నెలరోజులపాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పేరం సత్యనారాయణ పేర్కొన్నారు. తొలిరోజు సాయినామ సంకీర్తన నిర్వహించినట్లు తెలిపారు. జూన్ 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు సాయిభిక్ష కార్యక్రమం, జూన్ 19 నుంచి 25వ తేదీ వరకు సాయిజీవిత చరిత్రపై ఆధ్యాత్మిక ప్రవచనాలు, ఉపన్యాసాలు, 26 నుంచి జూలై 2 వరకు బాబా జీవిత చరిత్ర అఖండ పారాయణం, జూలై 3 నుంచి 5వ తేదీ వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, జూలై 6వ తేదీ షిరిడీ నుంచి వచ్చే బాబా పాదుకల ఊరేగింపు నిర్వహిస్తామని వివరించారు. జూలై 10వ తేదీన గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా సాయినాథునికి పంచామృతాభిషేకాలు, భక్తులకు అన్న సంతర్పణ, జూలై 11న రథోత్సవం నిర్వహిస్తామని మందిర ప్రధాన కార్యదర్శి గోపాలుని హరిహరరావు, కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి పీవీఎల్ఎన్వీ నాగరాజు, ఉపాధ్యక్షుడు గోపి, జాయింట్ సెక్రటరీ పవన్‌కుమార్, యూత్ ప్రెసిడెంట్ గోపాలుని కృష్ణమోహన్, కమిటీ సభ్యులు సూర్య నాగేశ్వరరావు, విజయ్, మహిళా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు భారతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

వైభవంగా కుంకుమ బండ్ల ఉత్సవం




ఆలయం వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగులో ఏరువాక పోలేరమ్మతల్లి జాతర సందర్భంగా గురువారం కుంకుమ బండ్ల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై పూజలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయం వద్ద శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతరత్పణ చేశారు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పొదిలి సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కొనకనమిట్ల ఎస్సై జి.ప్రభాకర్‌రెడ్డి తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



పూజలందుకుంటున్న పోలేరమ్మతల్లి, పోతురాజు



బుధవారం రాత్రి విద్యుత్ వెలుగుల్లో వైఎస్సార్ సీపీ ప్రభ

6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు జవహర్ నవోదయ విద్యాలయ–2లో 2026–27విద్యా సంవత్సరానికిగాను 6వ తరగతి ప్రవేశాలకు నిర్వహించే పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు httpr://c breitmr.rci.gov.in/nvrలో జూలై 29 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

గిద్దలూరు రూరల్/రాచర్ల: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల జాబితా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉందని, తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని గిద్దలూరు, రాచర్ల వ్యవసాయాధికారులు భాస్కర్‌రెడ్డి, షేక్. అబ్దుల్ రఫీక్ గురువారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల్లోగా లిస్టులో వచ్చిన పేర్లు వచ్చిన రైతులు తమ ఆధార్ కార్డుతో వీఏఏలను సంప్రదించి వేలి ముద్ర వేయాలని సూచించారు.

రాచర్ల డీటీ, టైపిస్టు బదిలీ

రాచర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ జి.భారతిబాయ్, బేస్తవారిపేట మండలానికి బదిలీపై వెళ్లగా, ఆమె స్థానంలో గిద్దలూరు ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ వై.స్వాతిని నియమించారు. రాచర్ల తహసీల్దార్ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న జాషువాను అర్ధవీడు మండలానికి బదిలీ చేయగా, ఆయన స్థానంలో అర్ధవీడు టైపిస్టు ఎస్. నాగమణిని నియమించినట్లు తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.